సాక్షి
పెద్దపల్లి
శనివారం ; 18 ; మార్చి ; 2023



రాజన్నా దీవించు

వేములవాడ: రాజన్నను శుక్రవారం 10 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. తల నీలాలు, నిలువెత్తు బంగారం, కోడె మొక్కులు చెల్లించుకున్నారు.



భక్తుల పుణ్య స్నానాలు

ధర్మపురి: ధర్మపురిలోని గోదావరినదిలో శుక్రవారం భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. గంగమ్మ, గౌరమ్మకు మొక్కులు చెల్లించి నైవేద్యాలు సమర్పించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
27.0/20.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. రాత్రి వేళ ఈదురుగాలులు వీస్తాయి.

నేరాల అదుపునకు పది సూత్రాలు



- అమలుపై పోలీసు అధికారులకు దిశానిర్దేశం
- నేర పరిశోధన, నేరాల నియంత్రణ, డేటా నిర్వహణ
- టెక్నాలజీ వినియోగం, నిందితుల గుర్తింపు
- ఫ్రెండ్లీ పోలీసింగ్, లీడర్‌షిప్, క్రమశిక్షణ
- మీడియా రిలేషన్, ప్రజల సహకారం అవసరం
- 'సాక్షి' ఇంటర్వ్యూలో రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి

సాక్షి ఇంటర్వ్యూ

గోదావరిఖని: 'నేర పరిశోధన.. రికార్డుల నిర్వహణ.. టెక్నాలజీ వినియోగం.. ఫ్రెండ్లీ పోలీసింగ్.. లీడర్‌షిప్.. ఇలా పది సూత్రాల అమలుపై పట్టు బిగించాలి.. క్రైం మ్యాపింగ్, క్రైం ట్రేసింగ్, రికార్డ్ నిర్వహణ, టెక్నాలజీ, మీడియా రిలేషన్స్‌పై పట్టుసాధిస్తే సమాజంలో ప్రజలు ప్రశాంతంగా జీవిస్తారని' రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి అన్నారు. రామగుండం పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన అనతికాలంలోనే నేరాల అదుపునకు తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి. వరుస చోరీలకు పాల్పడి పోలీసుశాఖకు చిక్కకుండా తప్పించుకు తిరుగుతున్న పగటి దొంగను అరెస్ట్ చేసి ఈప్రాంత వాసుల్లో ధైర్యాన్ని నింపారు. ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లాలంటేనే భయపడుతున్న క్రమంలో పగటి దొంగ అరెస్ట్‌తో రెండు జిల్లాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఇంటగెలిచి రచ్చగెలవాలనే సంకల్పంతో పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం ముందుగా పోలీస్ శాఖపై దృష్టి సారించారు. కమిషనరేట్ పోలీసు అధికారులకు పది సూత్రాల అమలుపై దిశానిర్దేశం చేస్తున్నారు. పటిష్ట ప్రణాళికతో ముందుకు సాగినప్పుడే నేరాలను సమర్థవంతంగా అరికట్టవచ్చని ధీమాగా చెబుతున్నారు. మహిళా పోలీసు అధికారిగా ఉన్న తన వద్దకు చాలా మంది మహిళలు తమకు జరిగిన అన్యాయాన్ని వివరించేందుకు ఎన్నో ఆశలతో వస్తున్నారని తెలిపారు. ఏదిఏమైనా చట్టానికి లోబడి పనిచేయాల్సి ఉంటుందన్నారు. ఈనేపథ్యంలో శుక్రవారం 'సాక్షి'తో మాట్లాడారు.

క్రైం మ్యాపింగ్.. ట్రేసింగ్..

తమ పోలీస్‌స్టేషన్ల పరిధిలో నేరాలు ఎక్కడ ఎక్కువగా జరుగుతాయో గుర్తించి నేరాలపై దృష్టి సారించాలి. గత నేరాలను రికార్డు చేస్తూ మ్యాపింగ్ చేసిన నేరాల నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో సూచించాలి. అలాగే నేరస్తుల గుర్తింపునకు ప్రాధాన్యం ఇవ్వాలి.

డేటా రికార్డు.. నిర్వహణ

నేరస్తుల డేటా రికార్డులు పొందుపర్చాలి. ఇలా నేరస్తులు, నేరాలు ముందుగానే తెలుసుకుంటే శాంతిభద్రతలు అదుపులో పెట్టవచ్చు. అన్ని పోలీస్‌స్టేషన్లలో నేరస్తుల వివరాలను గుర్తించి వీటి నిర్వహణ ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలి. దీంతో ఎక్కడైన నేరం జరిగితే పాత నేరస్తులతో పాటు అక్కడ జరిగిన సంఘటన ఆధారంగా నిందితులను తొందరగా గుర్తించే వీలుంటుంది.

అత్యాధునిక టెక్నాలజీ..

మారుతున్న కాలానికి అనుగుణంగా పోలీసు శాఖలో మార్పులు తీసుకవస్తున్నాం. ప్రధానంగా ప్రపంచమే కుగ్రామమై అరచేతిలోకి చేరిన క్రమంలో సైబర్ నేరాలు విపరీతంగా పెరిగిపోయాయి. చాలా మంది అమాయకులు ఆర్థికంగా నష్టపోతున్నారని, టీనేజీ యువత సెల్‌ఫోన్ ప్రపంచంలో పడి జీవితాలను కోల్పోతున్న ఈక్రమంలో సైబర్‌నేరాలపై అవగాహన ఉండేందుకు ప్రతీ పోలీసు అధికారి, సిబ్బందికి శిక్షణ ఇప్పించడంపై దృష్టి సారించాం. పోలీస్‌స్టేషన్ల వారీగా ఎంపిక చేసి సైబర్ క్రైంపై శిక్షణ ఇప్పిస్తున్నాం. ఆన్‌లైన్ ఆర్థిక నేరాలపై సీరియస్‌గా దృష్టి పెట్టాం. ఎంపిక చేసిన అధికారులు, సిబ్బందిని ఢిల్లీ, బోపాల్, హైదరాబాద్‌కు పంపించి సైబర్‌నేరాలపై పట్టుసాధించేందుకు అత్యాధునిక శిక్షణ ఇప్పిస్తున్నాం.

స్టేషన్ అధికారికి నాయకత్వ లక్షణాలుండాలి

ప్రతీ పోలీస్‌స్టేషన్ అధికారి నాయకత్వ లక్షణాలు కలిగి ఉండాలి. ప్రతీ విభాగంపై పట్టు సాధించాలి. స్టేషన్ మేనేజ్‌మెంట్, డిసిప్లేన్, లాఅండ్‌ఆర్డర్, పనుల కేటాయింపులో పారదర్శకత కలిగి ఉండాలి. నేరాల అదుపునకు ముందస్తు జాగ్రత్తలు, నేరం జరిగితే వాటిని చేధించడం, నేరస్తులకు శిక్ష పడేలా చూడటం ప్రతీ స్టేషన్ అధికారి బాధ్యత. అలాగే స్వీయ నియంత్రణ పాటించాలి.

వాస్తవాలను మీడియాకు వివరించాలి

ప్రస్తుత సమాజంలో పోలీసు అధికారులు మీడియాను గౌరవించాలి. ప్రతీ కేసులో పారదర్శకత పాటిస్తూ మీడియాకు వాస్తవాలను వివరించాలి. దీని ద్వారా ఊహాగానాలకు ఫుల్‌స్టాప్ పెట్టవచ్చు. ప్రతీ విషయాన్ని ప్రజలకు తెలియజెప్పాల్సిన బాధ్యత మనపై ఉంది.

సరిహద్దు ప్రాంతాలపై ప్రత్యేక నిఘా

రామగుండం పోలీస్ కమిషనరేట్ సరిహద్దు ప్రాంతాలపై ప్రత్యేక నిఘా పెట్టాం. ఇతర రాష్ట్రాల నుంచి నిషేధిత గంజాయి అక్రమ రవాణా జరగకుండా చెక్‌పోస్టులు ఏర్పాటు చేశాం. అలాగే మావోయిస్టుల కదలికలపై గట్టి నిఘా పెట్టాం. నిరంతర పర్యవేక్షణ కొనసాగుతోంది. మారుమూల గ్రామాల యువత కోసం జాబ్ మేళాలు నిర్వహిస్తాం. ఉపాధి అవకాశాల కోసం శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తాం.

ప్రజల సహకారంతోనే నేరాల అదుపు

సమాజంలో జరుగుతున్న నేరాల అదుపులో పెట్టేందుకు ప్రజల సహకారం ముఖ్యం. నేరం జరిగిన వెంటనే సమాచారం అందించడంతో పాటు నేరస్తుల విషయంలో కూడా పోలీసు శాఖకు సమాచారం అందిస్తే కేసును తొందరగా చేధించే అవకాశం ఉంటుంది. కీలక సమాచారం అందించే వారి పేర్లను గోప్యంగా ఉంచుతాం. అలాగే సమాజంలో నిత్యం జరుగుతున్న దొంగతనాలు, వాటి నివారణలో అందరి సహకారం అవసరం.

న్యూస్‌రీల్

జిల్లా ఆసుపత్రిని సందర్శించిన కాయకల్ప బృందం



ఆసుపత్రిని పరిశీలిస్తున్న బృందం సభ్యులు

పెద్దపల్లిరూరల్: జిల్లా ప్రభుత్వాసుపత్రిని శుక్రవారం కాయకల్ప అధికారుల బృందం సందర్శించింది. ఆసుపత్రి ఆవరణను కలియ తిరిగిన అధికారులు బయోవేస్టేజ్ నిర్వహణ, పరిశుభ్రత, హైజీన్ నిర్వహణ, ఆసుపత్రి రికార్డులను పరిశీలించారు. రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. నివేదికను రూపొందించి ఉన్నతాధికారులకు నివేదిస్తామని అధికారులు తెలిపారు. కాయకల్ప బృందంలో సభ్యులు డాక్టర్ రఘు, ప్రశాంత్, రెహమాన్, స్టెల్లా, జిల్లా ఆసుపత్రుల సూపరింటెండ్ శ్రీధర్‌తో పాటు వైద్య సిబ్బంది ఉన్నారు.

పోటాపోటీగా ఎన్నికల ప్రచారం



ఓటు అభ్యర్థిస్తున్న నాయకులు

పాలకుర్తి(రామగుండం): బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కర్మాగారంలో ఈనెల 20న జరుగనున్న పర్మినెంట్ కార్మిక సంఘం ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు తమ ప్రచారాన్ని ముమ్మరం చేశారు. అభ్యర్థులు తమ మద్దతుదారులతో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కంపెనీ గేట్ వద్ద కార్మికులను కలుస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. కొంతమంది నాయకులు కార్మికులను ఆకర్షించేందుకు విందు సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. ప్రచారంతో కంపెనీ పరిసర గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది.

దరఖాస్తుల ఆహ్వానం

పెద్దపల్లిరూరల్: జిల్లాస్థాయి ఖేలోఇండియా సెంటర్ ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి తిరుపతిరావు అన్నారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, తెలంగాణ అధికారుల ఆదేశాలకు అనుగుణంగా ఖేలో ఇండియా సెంటర్ ఏర్పాటుకు అంతర్జాతీయ, జాతీయస్థాయిలో గుర్తింపు పొందిన సీనియర్ క్రీడాకారుల (అథ్లెటిక్స్), ఇతర క్రీడల కోసం సంస్థల నుంచి దరఖాస్తుల స్వీకరిస్తున్నామని తెలిపారు. ఆర్చరీ, అథ్లెటిక్, బాక్సింగ్, బ్యాడ్మింటన్, సైక్లింగ్, పెన్సింగ్, హాకీ, జుడో, రేయింగ్, షూటింగ్, స్విమ్మింగ్, టేబుల్‌టెన్నిస్, వెయిట్ లిఫ్టింగ్, రెస్లింగ్, ఫుట్‌బాల్ తదితర క్రీడలకు సంబంధించిన ఖేలో ఇండియా సెంటర్లు ఏర్పాటు చేసేందుకు క్రీడాకారులు ముందుకు రావాలన్నారు. ఈనెల 20లోగా తమ కార్యాలయంలో దరఖాస్తులు ఇవ్వాలని కోరారు.

పత్తి క్వింటాల్ ధర రూ.7,162

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం పత్తి క్వింటాల్‌కు గరిష్టంగా ధర రూ.7,162 పలికింది. కనిష్టంగా ధర రూ.6011, సరాసరి ధర రూ.7062గా నమోదైందని మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి దేవరాజ్ పృధ్వీరాజ్ తెలిపారు.

నేటి నుంచి ఐదు రోజుల పాటు మార్కెట్‌బంద్

పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్‌యార్డులో శనివారం నుంచి ఈనెల 22 వరకు ఐదు రోజుల పాటు పత్తి కొనుగోళ్లు జరగవని మార్కెట్ కమిటీ ప్రత్యేకశ్రేణి కార్యదర్శి దేవరాజ్ పృధ్వీరాజ్ తెలిపారు. ఈనెల 23 నుంచి పత్తి కొనుగోళ్లు యధావిధిగా సాగుతాయని అన్నారు. రైతులు గమనించి పత్తి దిగుబడులను 23న మార్కెట్‌కు తేవాలని కోరారు.

గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుదాం

- ఊరూరా ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించాలి
- రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్



మాట్లాడుతున్న కొప్పుల ఈశ్వర్

పెద్దపల్లిరూరల్: వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుదామని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. శుక్రవారం బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సీఎం కేసీఆర్ సారథ్యంలోని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ఊరూరా ఆత్మీయ సమ్మేళనాలను నిర్వహిస్తూ ఏప్రిల్ 20 నాటికల్లా పూర్తి చేయాలని అన్నారు. పార్టీ పటిష్టత కోసం అంకిత భావంతో కష్టపడి పనిచేయాలని సూచించారు. విపక్ష పార్టీల ఎత్తులను ఎప్పటికప్పుడు చిత్తు చేసేలా ప్రతీ కార్యకర్త, నాయకుడు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. పార్టీ అంతర్గత వ్యవహారాలను చర్చించుకుని పరిష్కరించుకోవాలన్నారు. జిల్లా, మండల, గ్రామస్థాయిల్లో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించుకోవాలని సూచించారు. సమావేశంలో బీఆర్‌ఎస్ జిల్లా సమన్వయకర్త ఎర్రోళ్ల శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్, మండలి చీఫ్‌విప్ భానుప్రసాదరావు, ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధుకర్, ఐడీసీ మాజీ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్‌సింగ్, జిల్లాలోని ఎంపీపీ, జెడ్పీటీసీ, మండల పార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

28న జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్నికలు

- 23 నుంచి నామినేషన్ల స్వీకరణ
- నోటిఫికేషన్ జారీ చేసిన అడిషనల్ కలెక్టర్

పెద్దపల్లిరూరల్: జిల్లా రెడ్‌క్రాస్‌సొసైటీ మేనేజ్‌మెంట్ కమిటీకి ఈనెల 28న ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల నోటిఫికేషన్‌ను శుక్రవారం అడిషనల్‌కలెక్టర్ లక్ష్మీనారాయణ జారీ చేశారు. జిల్లా సహకార శాఖ అధికారి మైఖేల్‌బోస్‌ను ఎన్నికల అధికారిగా నియమించినట్లు పేర్కొన్నారు. సొసైటీలో 191 మంది సభ్యులున్నారు. 23న నామినేషన్ల స్వీకరణ, 24న పరిశీలన, 25న ఉపసంహరణ, 28న ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. అదేరోజు సాయంత్రం మూడున్నరగంటల నుంచి ఓట్లను లెక్కించి ఫలితాలను వెల్లడిస్తామని వివరించారు. ఎన్నికైన మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులను 29న సమావేశపరచి చైర్మన్, వైస్‌చైర్మన్, కోశాధికారి, కార్యదర్శి, రాష్ట ఎంసి సభ్యులను ఎన్నుకుంటారని తెలిపారు. నామినేషన్ పత్రాలను జిల్లా సహకారశాఖ కార్యాలయం నుంచి పొందవచ్చన్నారు. నామినేషన్ దాఖలు సమయంలో రూ.2,500 నాన్‌రిఫండబుల్ డిపాజిట్ చేయాల్సి ఉంటుందన్నారు. సొసైటీ ఓటరు జాబితా కోసం రూ.300లను చెల్లించి పొందవచ్చని పేర్కొన్నారు.

అకాల వర్షం.. పంట నష్టం

- నేలవాలిన మొక్క జొన్న పూతరాలిన మామిడి



గోపరపల్లెలో వర్షానికి నేలవాలిన మొక్కజొన్న

సుల్తానాబాద్: జిల్లాలో గురువారం రాత్రి కురిసిన అకాల వర్షంతో వివిధ పంటలకు నష్టం వాటిల్లింది. పలు మండలాల్లో చెట్లు, విద్యుత్ స్తంభాలు కింద పడ్డాయి. మామిడి పూత రాలగా, మొక్క జొన్న పంట నేలకొరిగింది. సుల్తానాబాద్‌లో రైస్‌మిల్ ధ్వంసమైంది. పెద్దపల్లి జిల్లా కేంద్రంతో పాటు కమాన్‌పూర్, జూలపల్లి, ఎలిగేడు, కాల్వశ్రీరాంపూర్, ఓదెల, ధర్మారం మండలాల్లో భారీ వర్షం కురువగా, మంథని మండలంలో అతి తక్కువగా వర్షం కురిసినట్లు వాతావరణ శాఖ అధికారులు ప్రకటించారు.

మొక్కజొన్న పంటకు భారీ నష్టం

భారీ వర్షంతో జిల్లాలో మొక్కజొన్న పంటకు భారీ నష్టం వాటిల్లింది. కంకి కోసే సమయంలో కిందపడిపోవడంతో యంత్రాలతో కోతలు కోయలేని పరిస్థితి నెలకొంది. వరిపైర్లు సుంకు దశలో ఉండటంతో అనేక ప్రాంతాల్లో సుంకురాలిపోవడం వల్ల ధాన్యం తాలు అవుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆరుగాలం శ్రమించి చేతికొచ్చే సమయానికి మొక్కజొన్న పంట నేలపాలు కావటంతో పెట్టిన పెట్టుబడి కూడా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు మామిడి, మొక్కజొన్న పంట నష్టాన్ని అంచనా వేసి పరిహారం అందించేలా చొరవ తీసుకోవాలని కోరుతున్నారు.

నేలవాలిన పంటల పరిశీలన



ఆశన్నపల్లెలో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న డీఏవో ఆదిరెడ్డి

కాల్వశ్రీరాంపూర్/ఓదెల(పెద్దపల్లి): జిల్లాలో అకాల వర్షానికి నేలవాలిన పంటలను శుక్రవారం వ్యవసాయాధికారులు పరిశీలించారు. ఓదెల, కాల్వశ్రీరాంపూర్ మండలాల్లో సుమారు 150 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి తెలిపారు. ముఖ్యంగా మొక్క జొన్న పంటకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. మరో రెండు మూడు రోజులు వర్షాలున్నట్లు వాతావరణ శాఖ హెచ్చరికలు చేసిన నేపథ్యంలో ఇంకా ఎక్కడైన నష్టం వాటిల్లితే పూర్తి వివరాలు సేకరించి పంట నష్టంపై ప్రభుత్వానికి వేదిక పంపుతామని తెలిపారు. ఓదెల, కాల్వశ్రీరాంపూర్ మండలాల్లో మొక్క జొన్న పంట నష్టపోయిన రైతుల వివరాలు, విస్తీర్ణం నమోదు చేస్తున్నామని అన్నారు. డీఏవో వెంట ఏవో నాగార్జున, ఏఈవోలు శ్రీనివాస్‌రెడ్డి, రాజు, పూర్ణచందర్, రమేశ్, రైతులు పాల్గొన్నారు.

నాణ్యమైన పౌష్టికాహారం అందించాలి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్

రామగిరి(మంథని): ప్రభుత్వ రెసిడెన్సియల్ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని కలెక్టర్ సంగీత అన్నారు. శుక్రవారం ముత్తారం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆహారపు స్టాక్, నాణ్యతను పరిశీలించారు. సౌకర్యాలు, ఆహారం వివరాలు, వాటి నా ణ్యత తదితర అంశాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కిచెన్ పరిసరాలు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. ఆహార నాణ్యత ప్రమాణాలపై ఎట్టి పరిస్థితుల్లో రాజీ పడొద్దని, అప్రమత్తంగా ఉండాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారులు వారి వారి మండలాల పరిధిలోని రెసిడెన్షియల్ గురుకుల, మోడల్, కేజీబీవీలను తరచూ తనిఖీ చేయాలని, ఆహారపు స్టాక్ నాణ్యత పరిశీలించి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని గమనించాలని సూచించారు. పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో మన ఊరు మన బడి ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. వన నర్సరీని సందర్శించి పెంచుతున్న మొక్కలు, సంరక్షణ కోసం తీసుకుంటున్న చర్యలను పరిశీలించారు. కలెక్టర్ వెంట ఎంపీడీవో కలికోత శ్రీనివాస్, ఎంపీవో వేణుమాధవ్, కేజీబీవీ ప్రత్యేక అధికారి కమల, వివిధ శాఖల అధికారులు తదితరులున్నారు.

బల్దియా అక్రమాలపై విజిలెన్స్ ఫోకస్

- ఫిర్యాదులతో విచారణ చేట్టిన విజిలెన్స్ అధికారులు
- వాహనాల కొనుగోలు, వాటి వినియోగంపై ఆరా
- లాగ్ బుక్కులు చూపకపోవడంపై ఆగ్రహం



రికార్డులను తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగరపాలక సంస్థలో అనేక అవినీతి, అక్రమాలు చోటు చేసుకున్నట్లు వస్తున్న ఫిర్యాదులపై రాష్ట్ర విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఫోకస్ పెట్టింది. ఇప్పటికే పలు దఫాలుగా విచారణ చేపట్టిన అధికారులు శుక్రవారం మరోసారి నేరుగా విచారణ చేపట్టారు. శానిటేషన్ విభాగంలో వాహనాల కొనుగోలు, హరితహారం, నామినేషన్ల టెండర్లు తదితర వాటిలో అక్రమాలు చోటు చేసుకున్నట్లు వచ్చిన ఫిర్యాదులపై హైదరాబాద్ నుంచి వచ్చిన విజిలెన్స్ విభాగం సీఐ అనిల్‌కుమార్, డీఈ వినోద్, ఏఈ శ్రీనివాస్ తదితరులు నేరుగా నగరపాలక సంస్థ కార్యాలయంలో విచారణ జరిపారు. శానిటేషన్ విభాగంలో వాహనాల కొనుగోలు, వాటికి చెల్లించిన బిల్లులు, పనిచేస్తున్న వాహనాలు, మూలకు పడిన వాహనాలు, నామినేషన్ పద్ధతిలో చేపట్టిన పనులు, చెల్లించిన బిల్లులు, హరితహారం కింద చెల్లించిన బిల్లులతో పాటు స్క్రాప్ చోరీ అయిన ఘటన తదితర ఫిర్యాదులపై మున్సిపల్ కమిషనర్ బి.సుమన్‌రావుతో పాటు డీఈ మాధవి, పలువురు ఏఈలు, శానిటేషన్ విభాగం అధికారులతో విడివిడిగా మాట్లాడి వివరాలు సేకరించారు. విజిలెన్స్ అధికారుల విచారణతో బల్దియా అధికారులు భయంతో వణికిపోతున్నారు.

శానిటేషన్ రికార్డుల తనిఖీ

శానిటేషన్ విభాగంలోని పలు రికార్డులను విజిలెన్స్ అధికారులు తనిఖీ చేసి అవసరమైన వాటిని ఫొటోలు తీసుకున్నారు. టీఎస్ ఆగ్రోస్ ద్వారా 2020–21లో సుమారు రూ.7కోట్ల నిధులతో కొనుగోలు చేసిన వాహనాలు, వాటికి ముందుగా తీసుకున్న కొటేషన్లు, ఆయా కంపెనీల వారంటీ, గ్యారంటీ బుక్స్, వాహనాల రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్, వాహనాలపై పని చేస్తున్న ఉద్యోగులు తదితర పూర్తి వివరాలపై ఆరా తీశారు.

లాగ్ బుక్కులు చూపకపోవడంపై ఆగ్రహం

శానిటేషన్ విభాగంలో ప్రస్తుతం నడుస్తున్న వాహనాలతోపాటు గతంలో వినియోగించి మరమ్మతుల సమస్యలతో మూలకుపడిన పడినట్లు చెబుతున్న జెట్టింగ్ మిషన్, లిట్టర్ పిక్కర్ మిషన్ వాహనాలతోపాటు కంపాక్టర్, ఫాగింగ్ మిషిన్ వాహనాల లాగ్ బుక్కులు చూపించాలని బల్దియా అధికారులను విజిలెన్స్ అధికారులు నిలదీశారు. ఆడిటింగ్‌కు పంపించామని సిబ్బంది పొంతన లేని సమాధానాలు చెప్పడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. చెత్త తరలించడానికి ఉపయోగిస్తున్న వాహనాల రీడింగ్‌ను నమోదు చేయకుండా ఖాళీగా వదిలేయడంపై నిలదీశారు. వాటి రికార్డులను సెలఫోన్‌లో ఫొటోలు తీసుకున్నారు. శానిటేషన్ విభాగంకు కేటాయించిన మొత్తం వాహనాల సంఖ్య, వాటి రిజిస్ట్రేషన్ నంబర్లు, అందులో పని చేస్తున్న, పని చేయని వాహనాల వివరాలను నివేదిక రూపంలో తీసుకున్నారు.

స్క్రాప్ మాయంపై వివరాల సేకరణ

బల్దియాకు చెందిన స్క్రాప్ చోరీ కావడంపై విజిలెన్స్ అధికారులు వివరాలు సేకరించారు. పోలీసులకు ఫిర్యాదు చేసిన కాపీ, ఎఫ్ఐఆర్ కాపీని సమర్పించాలని ఆదేశించారు. అలాగే బల్దియాలో ప్రస్తుతం భద్రపరిచిన స్క్రాప్ విలువ, వాటి వివరాలు కూడా చూపించాలని కోరగా.. సంబంధిత అధికారులు అందుబాటులో లేరని, కొంత సమయం కావాలని బల్దియా అధికారులు కోరినట్లు సమాచారం. వారం తర్వాత మరోసారి విచారణ చేపడుతామని, అప్పటిలోగా అడిగిన అన్ని వివరాలు, రికార్డులు, నివేదిక రూపంలో బల్దియా అధికారులు సిద్ధంగా ఉంచుకోవాలని విజిలెన్స్ అధికారులు సూచించారు.

కాంగ్రెస్ హయాంలోనే పరిశ్రమల స్థాపన



మాట్లాడుతున్న మక్కాన్ సింగ్‌ఠాకూర్

రామగుండం: కాంగ్రెస్ పార్టీ హయాంలోనే పరిశ్రమల స్థాపన జరిగిందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్‌ఠాకూర్ అన్నారు. శుక్రవారం రామగుండంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దివంగత సీఎం వైఎస్సార్ హయాంలోనే సింగరేణి స్థలాలకు పట్టాలు ఇప్పించామని అన్నారు. రామగుండం బీ థర్మల్ విద్యుత్ కేంద్రం పరిరక్షణ, నూతన విద్యుత్ కేంద్రం స్థాపనకు అధికార పార్టీ లేకుండా జేఏసీ ఏర్పాటు చేస్తే కాంగ్రెస్ పార్టీ కలిసివచ్చేందుకు సిద్ధమని తెలిపారు. బీథర్మల్ పునరుద్ధరణకు రూ.15 కోట్లు కేటాయిస్తే మరో దశాబ్దకాలం నడిపించుకునే అవకాశం ఉంటుందని, అందుకు సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ (సీఈఏ) సైతం కొనసాగింపుకు అనుమతించిన విషయాన్ని గుర్తు చేశారు. స్థానిక ఎమ్మెల్యే అసెంబ్లీలో మాట్లాడడం హర్షణీయమే కానీ ప్రభుత్వం నుంచి వచ్చిన సమాధానమేంటని ప్రశ్నించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మహేష్, మాజీ కౌన్సిలర్ అంజులు, కిరణ్‌కుమార్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం



విద్యుత్‌షాట్‌సర్క్యూట్‌తో దగ్ధమైన గుడిసె

ఎలిగేడు: మండలంలోని ముప్పిరితోటకు చెందిన గొల్లె శంకరయ్య గుడిసె ప్రమాదవశాత్తు విద్యుత్‌షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైంది. గుడిసెలో ఉన్న కూలర్, ఫ్రిజ్, టీవీతోపాటు బట్టలు, ఇంటిసామగ్రి పూర్తిగా కాలిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు. దాదాపు రూ.3 లక్షల ఆస్తినష్టం వాటిల్లిందని ఆర్‌ఐ శైలజ తెలిపారు ప్రాథమిక నివేదికను ఉన్నతాధికారులకు అందించనున్నట్లు పేర్కొన్నారు. శంకరయ్యకు ప్రభుత్వం ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కాంట్రాక్ట్ కార్మికులు ఐక్యత చాటాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ఈనెల 18,19 తేదీల్లో నిర్వహించే 8వ జిల్లా మహాసభలకు కాంట్రాక్ట్ కార్మికులు అధిక సంఖ్యలో హాజరై ఐక్యతను చాటాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు బి.అశోక్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్ కాలనీలోని వివిధ డివిజన్లలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులతో కలిసి మహాసభ వాల్‌పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు నిర్వహించే మహాసభలో సింగరేణి కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాము,రవి, పద్మ, లలిత, రాజనర్సు, రాంబాబు, శేఖర్, శ్రీను పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉద్యోగాలివ్వాలి

పెద్దపల్లిరూరల్: విద్యావంతులైన నిరుద్యోగులందరికీ ఉద్యోగావకాశాలను కల్పించాలని రాష్ట్ర కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి కొమురయ్య డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో శుక్రవారం విద్యార్థి, యువజన కాంగ్రెస్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సీఎం కేసీఆర్ మోసపూరిత పాలనను కొనసాగిస్తున్నాడని దుయ్యబట్టారు. తెలంగాణను అప్పుల తెలంగాణగా మార్చాడని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని, ఖాళీలను భర్తీ చేసేందుకు కాంగ్రెస్ చర్యలు తీసుకుంటుందన్నారు.

స్పీడ్ పోస్టు ద్వారా తలంబ్రాలు

గోదావరిఖనిటౌన్: శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలో జరిగే శ్రీసీతారాముల కల్యాణానికి సంబంధించిన తలంబ్రాలు స్పీడ్‌పోస్టు ద్వారా ఇంటివద్దకే అందించనున్నట్లు శుక్రవారం గోదావరిఖని తపాలాశాఖ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీనివాస్ తెలిపారు. అర్చన, కల్యాణ తలంబ్రాలు రూ.450, ముత్యాల తలంబ్రాలు రూ.150లుగా నిర్ణయించినట్లు ఆయన తెలియజేశారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మహిళా భద్రత సామాజిక బాధ్యత



సీపీ రాజేశ్వరికి స్వాగతం పలుకుతున్న విద్యార్థులు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సీపీ రాజేశ్వరి

- రామగుండం కమిషనర్ రెమా రాజేశ్వరి

రామగిరి(మంథని): మహిళల భద్రతను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని రామగుండం సీపీ రెమా రాజేశ్వరి అన్నారు. రామగిరి పోలీస్‌ల ఆధ్వర్యంలో స్థానిక సాయిరాం గార్డెన్‌లో గురువారం విద్యార్థినీ, విద్యార్థులకు నిర్వహించిన మహిళల భద్రత–పోలీస్ బాధ్యత అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. మహిళా సురక్ష, స్వశక్తి కరణం, ఉమెన్ సేఫ్టీ, ఉమెన్ ఎంపవర్మెంట్ వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మహిళల రక్షణపై పోలీస్‌శాఖ ప్రత్యేక దృష్టిసారిస్తోందన్నారు. మహిళల సంరక్షణకు షీ టీమ్స్, భరోసాసెంటర్, షీ షటిల్స్ ఏర్పాటుచేశామన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ప్రజల్లోకి మరింత చేరువవుతామన్నారు. మహిళలను, విద్యార్థినులను వేధింపులకు గురిచేసినా, ఈవ్ టీజింగ్‌కు పాల్పడినా, సోషల్ మీడియాలో అసభ్యకర మెసేజ్‌లు, పోస్టులు చేసినా కఠిన చర్యలుంటాయన్నారు. పెద్దపల్లి డీసీపీ వైభవ్ గైక్వాడ్ మాట్లాడుతూ.. విద్యార్థి దశనుంచే క్రమశిక్షణ, పట్టుదల, ఓపికతో కష్టపడి చదివి ఉన్నత లక్ష్యం చేరుకోవాలన్నారు. సైబర్‌నేరాలు, ఆన్‌లైన్‌మోసాలపై అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు, చుట్టుపక్కల వారికి తెలియజేయాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని, విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై వెంకటరమణ చేత మోటివేషనల్ స్పీచ్ ఇప్పించారు. అనంతరం గోదావరిఖని ఏసీపీ గిరిప్రసాద్, మంథని సీఐ సతీశ్, రామగిరి ఎస్సై రవిప్రసాద్‌ను సీపీ రాజేశ్వరి, డీసీపీ వైభవ్ గైక్వాడ్ అభినందించారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూ కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ శ్రీధర్‌రెడ్డి, మంథని ఎస్సై వెంకటేశ్వర్లు, ముత్తారం ఎస్సై రాములు, కళాశాల ప్రొఫెసర్స్, వాణీ స్కూల్స్ టీచర్స్, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పార్టీని మరింత పటిష్ట పర్చాలి

సుల్తానాబాద్(పెద్దపల్లి): బీఆర్‌ఎస్ పార్టీని మరింత పటిష్టపర్చి రానున్న ఎన్నికల్లో మళ్లీ అధికారంలోకి తీసుకవచ్చేందుకు కలిసికట్టుగా పనిచేయాలని ఎస్ఎంఎస్ఐడీసీ చైర్మన్, బీఆర్‌ఎస్ జిల్లా ఇన్‌చార్జి ఎర్రోళ్ల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం పెద్దపల్లిలో నిర్వహించే పార్టీ జిల్లా సమావేశానికి వెళ్తూ సుల్తానాబాద్‌లో ఆగారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. శాలువాలు, పూలమాలలతో ఆయనను సన్మానించారు. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి పార్టీని మరింత బలోపేతం చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు బుర్ర శ్రీనివాస్‌గౌడ్, పురం ప్రేంచందర్‌రావు, ముత్యం రమేష్‌గౌడ్, తిప్పారపు దయాకర్, పల్లా సురేష్,



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న శ్రీనివాస్

పకీర్ యాదవ్, కలీముద్దీన్ బోయిని రాజమల్లయ్య, కాదాసి చంద్రమౌళి, రాజమౌళి, రాజోజుల శివకుమార్, గడ్డం తిరుపతి గౌడ్, ప్రభాకర్ ,సంజీవ్ రాజేశ్వరరావు, కోటనితీష్ రెడ్డి, విక్కీ గౌడ్, గుండా అరుణ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మున్సిపల్ పరిధిలో డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ ఇళ్లు కేటాయించాలని బీజేపీ నాయకుడు గొట్టిముక్కుల సురేశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పెద్దపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల సమయంలో పేదలందరికీ డబుల్‌బెడ్రూం ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చిన సీఎం కేసీఆర్ ఇప్పటికీ ఆ హామీని నెరవేర్చలేదన్నారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో ఆఘమేఘాల మీద లక్కీడిప్ పద్ధతిన కొందరికే ఇస్తున్నట్లు చెప్పి అందరిలో అయోమయం సృష్టించి ఓట్ల రాజకీయానికి తెరలేపారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి మంజూరు చేసిన రెండు లక్షల ఇళ్లను ఎవరికి కట్టి ఇచ్చారో చెప్పాలన్నారు. 2016లో ఇళ్ల స్థలాలు మంజూరు చేసిన 162 మందికి డబుల్‌బెడ్రూం ఇళ్లు



మాట్లాడుతున్న సురేశ్‌రెడ్డి

ఇచ్చాకే ఇతరులకు కేటాయించాలని మున్సిపల్ కౌన్సిలర్లు కలెక్టర్‌ను కోరినా ఫలితం లేదన్నారు. నాయకులు కట్కూరి సత్యనారాయణరెడ్డి, మనోహర్, శ్రీనివాస్‌రెడ్డి, కరుణాకర్, ఫయాజ్, శ్రీధర్, ప్రమోద్‌రావు, శ్రీనివాస్, తిరుపతి, భాస్కర్‌రెడ్డి, రవితేజ, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

శుభకార్యానికి వెళ్తూ...తిరిగి రాని లోకాలకు

- రోడ్డు ప్రమాదంలో భార్య మృతి.. భర్త ,మరొకరికి గాయాలు
- ఆర్టీసీ బస్సు...లారీ డ్రైవర్ల అజాగ్రత్తే కారణం



సౌజన్య(ఫైల్)



ప్రమాద స్థలంలో సౌజన్య, మధూకర్

మంథని: ఓ శుభకార్యానికి వెళ్తున్న భార్యభర్తలను ప్రమాద రూపంలో భార్యను మృత్యువు కబలించగా భర్త తీవ్రంగా గాయపడ్డాడు. వీరితో పాటు వచ్చిన సమీప బంధువైన బాలుడికి సైతం తీవ్ర గాయాలైన ఘటన శుక్రవారం మంథని మండలం భట్టుపల్లి బస్టాప్ వద్ద చోటుచేసుకుంది. ఎస్సై వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. మంథని మండలం ఖానాపూర్‌కు చెందిన రాపాక మధూకర్ తన భార్య సౌజన్య(28) అన్న కుమారుడు యశ్వంత్‌తో కలిసి బైక్‌పై జయశంకర్ భూపాలపల్లి జిల్లా గొర్లవీడులో జరిగే శుభకార్యంలో పాల్గొనేందుకు వెళ్తున్నారు. మార్గమధ్యలో భట్టుపల్లి బస్టాండ్ వద్ద ఆర్టీసీ బస్సు నిలిచి ఉండడంతో పక్కనుంచి వెళ్తున్నారు. ఈ క్రమంలో బస్సుడ్రైవర్ బైక్‌ను గమనించకుండా సైడ్‌నుంచి ఢీకొట్టడంతో బైక్‌పై నుంచి ముగ్గురు కిందపడ్డారు. అదే సమయంలో ఎదురుగా వస్తున్న లారీ వేగంగా, అజాగ్రత్తగా వస్తూ మధూకర్, యశ్వంత్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి కాలు, తలకు గాయాలయ్యాయి. సౌజన్య తలకు బలమైన గాయం కావడంతో తీవ్ర రక్తస్రావమై స్పాట్‌లోనే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారన్నారు. గాయపడిన మధూకర్, యశ్వంత్‌ను మంథని సామాజిక వైద్యశాలలో ప్రథమ చికిత్స అందించి కరీంనగర్ తరలించారన్నారు. మృతురాలి తండ్రి నాంసాని అంజయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కడుపునొప్పి భరించలేక వివాహిత ఆత్మహత్య

రామగిరి(మంథని): ముత్తారం మండలం లక్కారం గ్రామానికి చెందిన పంజాల శ్యామల(40) వివాహిత కడుపు నొప్పి భరించలేక క్రిమిసంహారక మందుతాగి ఆత్మహత్యకు పాల్పడింది. ముత్తారం ఎస్సై రాములు కథనం ప్రకారం.. గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారాముల ఆలయం ప్రతిష్ఠాపనోత్సవాలకు కొడుకు శ్రీకాంత్‌తో గురువారం సాయంత్రం కలిసి వెళ్లి ఇంటికి తిరిగి వచ్చింది. ఈక్రమంలో శ్యామలకు విపరీతంగా కడుపు లేవడంతో శ్రీకాంత్ స్థానిక ఆర్‌ఎంపీ వైద్యుడిని తీసుకువచ్చేలోపు క్రిమిసంహారక మందుతాగి అపస్మారక స్థితికి చేరడంతో గమనించిన శ్రీకాంత్ తన స్నేహితుడి సాయంతో పెద్దపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించగా ప్రథమ చికిత్స అందించారు. వైద్యుల సూచనతో కరీంనగర్‌లోని ప్రైవేట్‌ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ శుక్రవారం మృతిచెందింది. మృతురాలి కుమారుడు శ్రీకాంత్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నదిలో దూకేందుకు యత్నం.. కాపాడిన రివర్ పోలీసులు

యైటింక్లయిన్‌కాలనీ: గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గోదావరి బ్రిడ్జి పైనుంచి శుక్రవారం నదిలోకి దూకేందుకు యత్నించిన ఓ వ్యక్తిని రివర్ పోలీసులు కాపాడారు. టూటౌన్ పోలీసులు, రివర్ పోలీసులు కథనం ప్రకారం.. యైటింక్లయిన్‌కాలనీకి చెందిన ఓ వ్యక్తి కుటుంబ సమస్యలతో కొంతకాలంగా మానసికవేదనకు గురవుతున్నాడు. ఈక్రమంలో జీవితంపై విరక్తి చెంది తన వాట్సప్‌లో మెడలో దండవేసుకుని ఫొటోపై ఓం శాంతి అని రాసుకుని గోదావరినది వద్దకు వచ్చి దూకే క్రమంలో అక్కడే విధులు నిర్వహిస్తున్న రివర్ పోలీసులు గుర్తించి పట్టుకున్నారు. అనంతరం కౌన్సిలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు. అన్ని సమస్యలకు ఆత్మహత్యలు పరిష్కారం కాదని టూటౌన్ సీఐ వేణుగోపాల్ సూచించారు. సదరు వ్యక్తిని కాపాడిన రివర్ పోలీసులను సీఐ అభినందించారు.

బీసీలకు 50శాతం రిజర్వేషన్లు వర్తింపజేయాలి

పెద్దపల్లిరూరల్: చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లను వర్తింప జేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు తాడూరి శ్రీమాన్ అన్నారు. శుక్రవారం పెద్దపల్లిలోని అమర వీరుల స్తూపం వద్ద మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం బీసీ గణన చేపట్టాలని డిమాండ్ చేశారు. బీసీల సమస్యల పరిష్కారానికి చర్చించేందుకు శనివారం హైదరాబాద్‌లో అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బీసీ సంక్షేమ సంఘ జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అధ్యక్షతన జరిగే సమావేశానికి ఎమ్మెల్సీ ఎల్.రమణ, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు జ్ఞానేశ్వర్ హాజరవుతున్నారని అన్నారు. నాయకులు రఘు, వెంకటేశ్, శంకర్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి తీవ్రగాయాలు

రామగుండం: రాజీవ్‌రహదారిపై కుందనపల్లి సమీపంలోని భారత్ పెట్రోల్ పంపు వద్ద శుక్రవారం ఎదురెదురుగా కారు–లారీ ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. అంతర్గాం ఎస్సై బోగె సంతోశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌కు చెందిన రావుల రఘు–సరోజన దంపతులు బెల్లంపల్లిలో ఓ వివాహానికి హాజరయ్యేందుకు కారులో వెళ్తున్నారు. ఈ క్రమంలో కారు అదుపుతప్పి మధ్యలోని డివైడర్‌ను ఢీకొట్టి కరీంనగర్‌వైపు కర్ర లోడుతో వెళ్తున్న లారీని ఢీకొంది. కారులో ఉన్న వారికి తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం కరీంనగర్‌కు తరలించారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

- అధికారుల సంఘం నాయకుల వినతి



జీఎంను సన్మానిస్తున్న నాయకులు

గోదావరిఖని: చోరీల నియంత్రణకు అధికారుల క్వార్టర్లలో సీసీ కెమెరాలు ఏర్పాటుచేయాలని సింగరేణి అధికారుల సంఘం నాయకులు కోరారు. శుక్రవారం ఆర్జీ–1 జీఎం కె.నారాయణను కలిసి సమస్యలపై వినతి పత్రం అందించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. మంచినీరందిస్తున్న పాతపైపులైన్లను తొలగించి కొత్తవాటిని ఏర్పాటు చేయాలన్నారు. అధికారుల కోసం నూతనంగా క్వార్టర్లు నిర్మించాలన్నారు. ఆర్సీవోఏ క్లబ్‌లో ఏసీ సౌకర్యం, జిమ్‌గది ఏర్పాటు చేయాలన్నారు. పవర్‌హౌస్ కాలనీ, శారదానగర్‌లో యోగా గదులు నిర్మించాలన్నారు. పాడైన రోడ్లకు మరమ్మతులు చేయాలన్నారు. డాక్టర్స్ కాలనీలో కార్‌షెడ్ ఏర్పాటుచేయాలన్నారు. ఈ సందర్భంగా జీఎం నారాయణను శాలువాతో సన్మానించారు. సమావేశంలో సీఎంవోఏఐ అధ్యక్షుడు పానుగోటి శ్రీనివాస్, సెక్రటరీ డేవిడ్, వైస్‌ప్రెసిడెంట్ డాక్టర్ మధుకుమార్, జాయింట్ సెక్రటరీ మహమ్మద్‌అలీ, ట్రెజరర్ శ్రావణ్, ఎస్‌ఓటూ జీఎం రామ్‌మోహన్, డీజీఎం పర్సనల్ లక్ష్మి నారాయణ, డీవైసీఎంవో కిరణ్‌రాజ్‌కుమార్, ఏరియా వర్క్‌షాప్ మదన్‌మోహన్, పర్సనల్ మేనేజర్ సలీం, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

బొగ్గు రవాణా మరింత వేగవంతం

గోదావరిఖని: భూగర్భ గనిలో స్ట్రాటా బంకర్ నిర్మాణంతో బొగ్గు రవాణా మరింత వేగవంతం అవుతుందని ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్ అన్నారు. వకీల్‌పల్లిగనిలోని 4వ సీమ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన స్ట్రాటా బంకర్‌ను ప్రారంభించి మాట్లాడారు. స్ట్రాటా బంకర్‌తో బొగ్గు ఉత్పత్తిలో రవాణా మార్గం బ్రేక్ డౌన్ ఉన్నప్పుడు 3వ సీమ్ నుంచి ఉత్పత్తి అయిన బొగ్గును నిల్వ చేసుకునే వీలు కలుగుతుందన్నారు. నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించేందుకు బంకర్ దోహదపడుతుందని, రోజుకు రూ.లక్ష విద్యుత్ ఆదా అవుతుందని తెలిపారు. రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి సాధించాలన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి రవీందర్, గని మేనేజర్ రవికిరణ్, డీజీఎం (పర్సనల్) రాజేంద్రప్రసాద్, డీజీఎం (వర్క్‌షాప్)



బంకర్‌ను ప్రారంభిస్తున్న జీఎం మనోహర్

ఎర్రన్న, సర్వే అధికారి రహ్మత్‌అలీ, గ్రూప్ ఇంజినీర్ చంద్రశేఖర్, గని రక్షణ అధికారి రాంకుమార్, గని ఫిట్ సెక్రెటరీ మల్లికార్జున్, సంక్షేమాధికారి ఓంకారిబాబు, ఫిట్ ఇంజినీర్ జలపతి పాల్గొన్నారు.

ప్రలోభాలకు ఓట్లు అమ్ముకోవద్దు

- బీజేపీ నాయకుడు కౌశికహరి



కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న కౌశికహరి

పాలకుర్తి: కార్మికులు సమస్యల పరిష్కారానికి పోరాడే నాయకులను ఎన్నుకోవాలని, డబ్బులు, ఇతర ప్రలోభాలకు తమ ఓటును అమ్ముకోవద్దని బీజేపీ నాయకుడు కౌశికహరి అన్నారు. శుక్రవారం బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ ఫ్యాక్టరీ ఆవరణలో కార్మికులనుద్దేశించి మాట్లాడారు. కేశోరాం సిమెంట్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రాతినిధ్య కార్మిక సంఘాలు విఫలమయ్యాయన్నారు. దీంతో కార్మికులకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. 18 ఏళ్లుగా కేశోరాం కార్మిక సంఘం ఎన్నికల్లో పోటీచేస్తున్నానని, వచ్చే కాంట్రాక్ట్ కార్మికసంఘం ఎన్నికల దృష్ట్యా ఈసారి పర్మినెంట్ కార్మికసంఘం ఎన్నికల్లో పోటీచేయడం లేదన్నారు. కేశోరాం ఎన్నికల్లో పోటీ అంటేనే నాయకులు భయపడే పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా కార్మికులు ప్రలోభాలకు లొంగకుండా మంచి నాయకుడిని ఎన్నుకోవాలని, కార్మికులు ఈ విషయంలో ఆలోచన చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు కమలాకర్‌రెడ్డి, కంకటి శ్రీనివాస్, గండికోట బొబ్బిలిరాజ్, పెరుమాండ్ల రమేశ్, బత్తిని సతీశ్, ఆకుల కొమురయ్య, బాకీ సురేశ్, పూసాల ప్రసాద్, రవి, నర్సయ్య కార్మికులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు



ప్రొసీడింగ్ కాపీ అందిస్తున్న మంత్రి ఈశ్వర్

ధర్మారం: మండలంలోని వివిధ గ్రామాల్లో కుల సంఘం భవన నిర్మాణాలకు, సీసీ రోడ్ల ఏర్పాటుకు రూ.1.3 కోట్లు నిధులను మంజూరైనట్లు మంత్రి కొప్పుల ఈశ్వర్ తెలిపారు. కరీంనగర్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆయా గ్రామాల సర్పంచులకు ప్రొసీడింగ్ కాపీలను అందించారు. మండలంలోని బొట్లవనపర్తిలో మున్నురుకాపు సంఘం భవనానికి రూ.10లక్షలు, మాల, మాదిగ సంఘం భవనాలకు రూ.10లక్షలు, న్యూకొత్తపల్లిలో మాల సంఘం భవనానికి రూ.5 లక్షలు, ధర్మారం మండల కేంద్రంలో హనుమాన్ ట్రాలీ యూనియన్ భవనానికి రూ.5 లక్షలు, బొమ్మారెడ్డిపల్లి రెడ్డి సంఘం భవనం ప్రహరీ నిర్మాణానికి రూ.5 లక్షలు, సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.10 లక్షలు, రచ్చపల్లి పద్మశాలీ సంఘం భవనానికి రూ.5 లక్షలు, చింతలపల్లిలో బీసీ సంఘం భవనానికి రూ.5 లక్షలు, రామయ్యపల్లి ముదిరాజ్ సంఘం భవనానికి రూ.5 లక్షలు, కొత్తూరు మాలసంఘం భవనానికి రూ.5 లక్షలు, దళిత సంఘానికి రూ.5 లక్షలు, మున్నూరుకాపు, గిరిజన, పద్మశాలీ సంఘం భవన నిర్మాణాలకు ప్రొసీడింగ్ కాపీలను ఆయా గ్రామాల సర్పంచులకు అందించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



అరుణ్ మృతదేహం

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రామగుండం బీ పవర్‌హౌస్ రాజీవ్ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో దేదావత్ అరుణ్(22) మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి. రామగుండం కార్పొరేషన్ రెండో డివిజన్ న్యూపీకే రామయ్యకాలనీకి చెందిన దేదావత్ అరుణ్ తన సోదరుడిని రామగుండం రైల్వే స్టేషన్ నుంచి తీసుకురావడానికి ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. కలర్వు వద్ద వాహనంపై నుంచి పడి తీవ్రగాయాలు కావడంతో స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. ఘటనా స్థలంతో పాటు ఆస్పత్రిలోని అరుణ మృతదేహాన్ని పోలీసులు పరిశీలించి ప్రమాద వివరాలపై విచారణ చేస్తున్నారు.

గుండె పోటుతో ప్రముఖ వ్యాపారి..

ఎన్టీపీసీ రామగుండం ప్రాంతానికి చెందిన బాలాజీ హార్డ్‌వేర్ యజమాని నారాయణదాస్ గుండెపోటుతో శుక్రవారం మృతి చెందాడు. నారాయణదాస్ మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

రక్తదానంతో ప్రాణదాతలు కావాలి

- ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్



సర్టిఫికెట్లతో ఉద్యోగులు, ఆర్జీ–2 జీఎం

గోదావరిఖని: రక్తదానంతో ప్రాణదాతలు కావాలని ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్ అన్నారు. శుక్రవారం సెక్టార్–3 డిస్పెన్సరీలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. రక్తదానం మరొకరి నిండు ప్రాణాలను కాపాడుతుంద న్నారు. తలసేమియా, హిమోఫిలియా ఉన్నవారికి రక్తం తరచూ అవసరమన్నారు. ఎలాంటి అపోహలు లేకుండా ప్రతీ మూడు నెలలకోసారి రక్తదానం చేయాలన్నారు. ఈ సందర్భంగా 39 మంది ఉద్యోగులు రెడ్‌క్రాస్ సొసైటీకి రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఏరియా టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్, ఎస్‌ఓ టూ జీఎం అబ్దుల్‌సలీం, పర్సనల్ డీజీఎం రాజేంద్రప్రసాద్, డిస్పెన్సరీ సూపరింటెండెంట్ డాక్టర్ మహిపాల్, వీటీసీ మేనేజర్ రంగారెడ్డి, సీనియర్‌సెక్యూరిటీ అధికారి పీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

పవిత్ర స్థలం.. పనులు సులువు

- శివలింగం జరపొద్దు
- అంకుటితో దీక్షతో పనులు వేగం
- తోగుటరంగపేటసరస్వతిపీఠాధిపతులు శ్రీశ్రీశ్రీమాధవానందసరస్వతి స్వామి



మాట్లాడుతున్న మాధవానంద సరస్వతీ స్వామి

సుల్తానాబాద్: ఈ ఆలయ స్థలం చాలా పవిత్రమైనదని పనులు అనుకుని పూజిస్తే సులువుగా అవుతాయని తోగుట రంగపేట సరస్వతీ పీఠాధిపతులు శ్రీశ్రీ మాధవానంద సరస్వతీ స్వామి అన్నారు. సుల్తానాబాద్ పట్టణంలోని అతిపురాతన ఆలయమైన మిట్టపల్లిలోని శ్రీ శంకర దేవాలయం పునర్నిర్మాణ కార్యక్రమానికి హాజరై శుక్రవారం పరిశీలించి, అర్చకులు, పుర ప్రముఖులతో చర్చించారు. ఆలయంలోని శివలింగాన్ని జరపకుండా మిగిలిన విగ్రహాలను జరపవచ్చన్నారు. కార్యక్రమంలో అర్చకులు చంద్రశేఖర శర్మ, గోపి, లక్ష్మణ శర్మ, ఆలయ కమిటీ సభ్యులు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



సాధించిన మెడల్స్, సర్టిఫికెట్లతో విద్యార్థులు

జ్యోతినగర్: జాతీయస్థాయి రోలర్‌స్కేటింగ్ పోటీలకు ఎన్టీపీసీకి చెందిన పలువురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల కరీంనగర్‌లో ని ర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో బాలికల విభాగంలో స్నితిక, దేవాన్షి, అయనా, బాలుర వి భాగంలో ఆరాధ్య, అద్వైత్‌లాల్, భార్గవ్‌రామ్, అక్షిత్ శౌర్య, సాయి సిద్ధార్థ్‌లు విజేతలుగా నిలిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఛండీఘడ్‌లోని మొహాలిలో ఏప్రిల్ 26 నుంచి 29వ వరకు నిర్వహించే జాతీయస్థాయి రోలర్‌స్కేటింగ్ పోటీలలో పాల్గొంటున్నట్లు కోచ్ కృష్ణగౌడ్ తెలిపారు. క్రీడాకారులను ఎన్టీపీసీ యాజమాన్యం పలువురు అభినందించారు.

కేసీఆర్ ఆరోగ్యం కోసం హోమం



హోమం నిర్వహిస్తున్న కోలేటి దామోదర్

గోదావరిఖని: ముఖ్యమంత్రి కేసీఆర్ ఆరోగ్యంగా ఉండాలని కోరుతూ రాష్ట్ర హౌసింగ్‌బోర్డు చైర్మన్ కోలేటి దామోదర్ శుక్రవారం వేదపండితులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోదావరిఖనిలోని తన నివాసంలో ప్రత్యేక హోమం చేశారు. బీఆర్‌ఎస్ పార్టీ జాతీయ స్థాయిలో పుంజుకోవాలని కోరారు.